సాక్షి కర్నూలు

మంగళవారం ၊ 31 ၊ అక్టోబర్ ၊ 2023



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి సోమవారం విజయవాడకు చెందిన ఆర్.సదాశివ, సీతామహాలక్ష్మి రూ.1,23,000 విరాళంగా అందజేశారు.



వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం వైభవంగా వెండి రథోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన చేశారు.



యముడి చెక్‌పోస్టులు ఎత్తివేత!

డోన్ శివారులో ఎన్‌హెచ్ 44 రోడ్డు వెంబడి సర్వీసు రోడ్డు పూర్తయ్యింది. మంత్రి బుగ్గన చొరవతో రెండు అండర్ పాస్ బ్రిడ్జీలు నిర్మించారు. దీంతో ప్రమాదాలకు చెక్ పడింది. IIలో

దిగులు తొలగిస్తూ.. ధీమా ఇస్తూ

- అన్నదాతకు అండగా నిలిచిన ఉచిత పంటల బీమా
- రైతు వాటా ప్రీమియం మొత్తాన్ని భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ–క్రాప్ ఆధారంగా పథకం అమలు
- ఖరీఫ్‌లో 10,17,601 ఎకరాల్లో వివిధ పంటల సాగు
- 59,965 ఎకరాలకు మినహా అన్ని పంటలకూ బీమా సౌకర్యం
- నాలుగేళ్లలో బీమా పరిహారం కింద రూ.1,045.44 కోట్ల చెల్లింపు

పంట ఎండినా..ప్రకృతి పగబట్టి పైరును నాశనం చేసినా.. రైతు రెక్కల కష్టానికి విలువ ఉండదు. రేయింబవళ్లు చేసిన శ్రమ అంతా వృథా అవుతుంది. మట్టి మనిషికి దిగులే మిగులుతుంది. ఇలాంటి పరిస్థితుల నుంచి కర్షకులను గట్టెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. అన్నదాతకు పైసా ఖర్చు లేకుండా బీమా పరిహారాన్ని అందజేస్తోంది. గత నాలుగేళ్ల కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9.13 లక్షల మంది రైతులకు రూ.1,045.44 కోట్ల బీమా పరిహారం అందింది.



ఈ ఏడాది కర్నూలు జిల్లాలో ఉచిత బీమా కిందకు వచ్చిన పంటల సాగు విస్తీర్ణం, బీమా విలువ, ప్రీమియం చెల్లింపు వివరాలు

నోటిఫై అయిన పంట	బీమా వర్తింపు (ఎకరాల్లో)	బీమా చేసిన మొత్తం హెక్టారుకు (రూపాయల్లో)	ప్రీమియంలో (హెక్టారుకు) రైతువాటా (శాతంలో)	హెక్టారుకు రైతు భరించాల్సినది (రూపాయల్లో)
వరి	31,267	87,500	1.50	1,312.50
మొక్కజొన్న	14,427	75,000	1.50	1,125
కంది	89,492	50,000	2.00	1,000
ఎండుమిర్చి	1,48,447	2,00,00	1.80	3,600
జొన్న	1,502	45,000	2.00	900
ఆముదం	50,818	40,000	1.50	675
కొర్ర	4,344	37,500	1.50	562.50
సజ్జ	1,59,902	35,000	1.50	525
ఉల్లి	41,696	1,00,00	3.80	3,800
పత్తి	4,99,075	90,000	5.00	4,500
వేరుశనగ	77,165	65,000	2.00	1,300

కర్నూలు(అగ్రికల్చర్): టీడీపీ హయాంలో పంటల బీమా అత్యంత ఖరీదుగా ఉండేది. ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉండేది. దీంతో సామాన్య, మధ్య తరగతి రైతులు బీమాకు దూరంగా ఉండేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుల సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు బీమా పరిహారం అందుతోంది. ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 10,17,601 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో 9,57,642 ఎకరాలకు ప్రభుత్వం ఉచితంగా బీమా సదుపాయం కల్పించింది. ఖరీఫ్‌లో సాగైన మొత్తం విస్తీర్ణంలో 59,959 ఎకరాలకు మినహా మొత్తం పంటలకు బీమా సదుపాయం లభించినట్లు అయింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పంటల బీమాపైనే ఆశలు పెట్టుకున్నారు.

ముగిసిన ఈ–క్రాప్ బుకింగ్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయ్యింది. ముసాయిదా జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టారు. గ్రామసభలు నిర్వహించి ఈ–క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను చదివి వినిపించారు. సోషల్ ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను ప్రస్తుతం వ్యవసాయ యంత్రాంగం పరిశీలిస్తోంది. త్వరలో ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి తుది జాబితాను ప్రకటించడానికి రంగం సిద్ధమవుతోంది. తుది జాబితను ప్రకటించిన వెంటనే నోటిఫై అయిన పంటల డేటా బీమా కంపెనీలకు వెళ్తుంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019 నుంచి 2022 వరకు వచ్చిన బీమా పరిహారం వివరాలు..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	పొందిన పరిహారం (రూ.కోట్లలో)
2019	1,13,866	129.51
2020	1,85,744	181.22
2021	3,28,892	495.54
2022	2,85,183	239.17
మొత్తం	9,13,685	1,045.44

11 పంటలకు బీమా సదుపాయం

కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 11 పంటలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద నోటిఫై అయ్యాయి. అలాగే నంద్యాల జిల్లాలో 9 పంటలను నోటిఫై చేశారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా– వాతావరణ ఆధారిత బీమా కింద వర్షాధారం పత్తి, వేరుశనగ పంటలు నోటిఫై అయ్యాయి. వాతావరణ బీమాను బజాజ్ అలియాంజ్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తోంది. డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా–ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)ను పంట దిగుబడుల ఆధారంగా అమలు చేస్తారు. దీనినే దిగుబడి ఆధారిత బీమాగా వ్యవహరిస్తారు. జిల్లాలో ఈ బీమాను ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అమలు చేస్తోంది. వరికి గ్రామం యూనిట్‌గా బీమా సదుపాయం కల్పిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం, కొర్ర, సజ్జ, ఉల్లి పంటలకు ఉచిత పంటల బీమా సదుపాయం లభించింది.

పైసా ఖర్చు లేకుండానే..

ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసిన పత్తికి వాతావరణ ఆధారిత బీమా సదుపాయం ఉంది. హెక్టారుకు రూ. 90,000 బీమా చేస్తారు. మార్గదర్శకాల ప్రకారం ఎకరాకు 5 శాతం ప్రీమియం రూ.4,500 చెల్లించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో వర్షాధారం కింద 4,99,075 ఎకరాల్లో పత్తి సాగైంది. రైతులు పైసా ఖర్చు చేయకుండానే బీమా పరిహారాన్ని పొందవచ్చు. జిల్లాలో ఎండుమిర్చి 1,48,447 ఎకరాల్లో సాగైంది. హెక్టారుకు రూ.2 లక్షల బీమా ఉండగా.. రైతులు 3.80 శాతం ప్రీమియం రూ.3,600 చెల్లించాల్సి ఉంది. రైతులపై ఒక్క రూపాయి భారం పడకుండా వాటా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా మొత్తం 11 రకాల పంటలకు రైతు వాటా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది.

నాలుగేళ్లలో రూ.1045.44 కోట్లు చెల్లింపు

రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా బీమా సదుపాయం పొందుతుండటం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో తప్ప దేశంలో ఎక్కడా లేదు. టీడీపీ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు అందిన బీమా పరిహారం రూ.180 కోట్లు మాత్రమే. 2019 నుంచి 2022 వరకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క రూపాయి ప్రీమియం తీసుకోలేదు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.1045.44 కోట్లు పరిహారాన్ని చెల్లించింది. 2024–24 సంవత్సరంలో కూడా బీమా అమలును పకడ్బందీగా చేపట్టనున్నారు.

పంటల బీమా ఆదుకుంటోంది



పంటల బీమా రైతులను ఆదుకుంటోంది. 2022–23 ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో పత్తి, 6 ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. పత్తికి బీమా కింద రూ.31,000, ఉల్లికి రూ.38,000 మొత్తంగా రూ.69,000 పరిహారం లభించింది. ఈ సారి ఖరీఫ్‌లో సరిగ్గా వర్షాలు లేవు. పైర్లలో ఎదుగుదల లేకపోవడంతో తొలగించాం. ప్రస్తుతం 2.40 ఎకరాల్లో పత్తి ఉంది. దీనిని ఈ–క్రాప్‌లో నమోదు చేయించాం. ఈ–కేవైసీ కూడా చేయించాం. ఈ సారి బీమాపై ఆశలు ఉన్నాయి.

– నాగభూషణంరెడ్డి, చిన్న కొట్టాల, కల్లూరు మండలం

రైతులకు ఎంతో ఊరట



2023–24 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల నమోదు ప్రక్రియను 100 శాతం పకడ్బందీగా చేపట్టాం. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే బీమా పరిధిలోకి వస్తాయి. త్వరలోనే ఈ–క్రాప్ డేటా బీమా కంపెనీలకు వెళ్తుంది. 2019 నుంచి 2022 వరకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద రైతులు ఒక్క రూపాయి ప్రీమియం లేకుండా పరిహారం పొందారు. బీమా రైతులకు ఎంతో ఊరటనిస్తోంది.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

న్యూస్‌రీల్

కర్నూలులో ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- 3 నుంచి 5 వరకు నిర్వహణ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): కర్నూలు–హైదరాబాద్ హైవేపై ఉన్న రావూరి గార్డెన్స్‌లో నవంబర్ 3, 4, 5 తేదీల్లో ప్రాన్స్ అండ్ ఫిష్ అండ్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫెస్టివల్‌లో చేపలు, రొయ్యలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారన్నారు. మత్స్యశాఖలో ఉపాధి అవకాశాలను తెలియజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి

- గరిష్టంగా క్వింటా ధర రూ.4,885

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తింది. ఈ నెల 28వ తేదీ వరకు ధరలు మెరుగ్గా ఉండటంతో సోమవారం మార్కెట్‌కు ఉల్లి భారీగా వచ్చింది. నెల రోజుల వ్యవధిలో మార్కెట్‌కు గరిష్టంగా 2,500 క్వింటాళ్ల వరకే వచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొదటి నుంచి మార్కెట్‌కు ఉల్లి తాకిడి అంతంతమాత్రంగానే ఉంది. ఈ నెల 25న 348 క్వింటాళ్లు, 26న 777 క్వింటాళ్లు, 27న 2023 క్వింటాళ్లు, 28న 2,444 క్వింటాళ్ల ప్రకారం ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. ఉన్నట్టుండి ధరల పెరుగుదల నేపథ్యంలో ఉల్లి మార్కెట్‌కు భారీగా రావడం విశేషం. రికార్డు స్థాయిలో 5,608 క్వింటాళ్లు వచ్చింది. అయితే ఉల్లి ధర కాస్త తగ్గింది. ఈ నెల 28న ఉల్లికి గరిష్ట ధర రూ.5,598 లభించింది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం మార్కెట్‌లో ఉల్లి క్రయవిక్రయాలు జరిగాయి. కనిష్టంగా రూ.1,187, గరిష్టంగా రూ.4,885 పలికింది. మోడల్ ధర రూ.3,027 నమోదైంది.

నవోదయ దరఖాస్తుకు 7 వరకు గడువు

ఎమ్మిగనూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ ఈ. పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని, అయితే గడువును నవంబర్ 7 వరకు పొడిగించినట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్ష 2024 ఫిబ్రవరి 10న ఉంటుందని తెలిపారు.

శ్రీశైలం నుంచి 4,645 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి ఆదివారం నుంచి సోమవారం వరకు 4,645 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,410 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 655 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 69.1600 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 844.50 అడుగులకు చేరుకుంది.

గోవిందా.. గోవింద



పవిత్ర మాలలతో కొలువైన ఉత్సవ మూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ ప్రహ్లాదవరదస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజ పూజలు ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను యాగశాలలో కొలువుంచి వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను నూతన పట్టు పీతాంబరాలతో ముస్తాబుచేసి పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాల మధ్య మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మంత్రాలయంలో మహర్షి వాల్మీకి విగ్రహం



వాల్మీకి విగ్రహానికి గజమాల వేసి పూజలు చేస్తున్న వై.సీతారామిరెడ్డి, మధుసూదన్ తదితరులు

- పండుగలా విగ్రహావిష్కరణ కార్యక్రమం

మంత్రాలయం: ప్రముఖ అధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చస్తశారు. సోమవారం విగ్రహావిష్కరణ కార్యక్రమం పండుగలా సాగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి సోదరులు రాఘవేంద్రసర్కిల్ నుంచి వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహర్షి విగ్రహానికి గజమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వై.సీతారామిరెడ్డి, మధుసూదన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వై.సీతారామిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేశామన్నారు. వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాని కేటాయించడంతో పాటు ఆర్థిక సహాయం అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో వాల్మీకి సోదరులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.భీమారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, సచివాలయ మండల కో కన్వీనర్ వీకేసీ రాఘవేంద్రాచారి, వ్యవసాయసలహామండలి సభ్యులు మల్లికార్జున, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

రూ.189.27 కోట్లతో 39 రోడ్లు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హై ఇంపాక్ట్ రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187.27 కోట్లతో పాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి.రాజశేఖర్ ఈ నెల 30న జీఓ 726 జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన రోడ్లను గుర్తించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు రోడ్లను ఎంపిక చేసి అంచనాలు రూపొందించి పంపించాలని కోరింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 39 రోడ్లను గుర్తించి రూ.189.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగానే ఆయా పనులకు పాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ పనులకు వెంటనే టెండర్లను ఆహ్వానించి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయనున్నారు.

ఏ నియోజకవర్గంలో ఎన్ని రోడ్లంటే..

ఎమ్మిగనూరు	02
ఆలూరు	04
పత్తికొండ	01
కోడుమూరు	04
ఆళ్లగడ్డ	06
నంద్యాల	03
శ్రీశైలం	05
బనగానపల్లె	01
నందికొట్కూరు	05
డోన్	05
పాణ్యం	03

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సృజన



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, అధికారులు

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్‌డీసీలు రమ, నాగప్రసన్నలక్ష్మీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పరిష్కారాల కోసం వివిధ శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారుల అసంతృప్తి స్థాయి పెరుగుతోందని, ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసంతృప్తి వ్యక్తం చేసిన లబ్ధిదారుల వివరాలపై ఆడిట్ నిర్వహించి ప్రతి శనివారం తనకు నివేదిక సమర్పించాలని డీఆర్వో, జెడ్పీ సీఈఓలను ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయానికి పిలిపించుకొని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్‌ను వారి చేతికి ఇచ్చి రసీదు పొందాలని రాతపూర్వకంగా ఆదేశాలిచ్చామని, ఎవరూ పాటించడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆదేశాలను పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయాల ఆధునీకరణ పనులు మూడు, నాలుగు నెలల్లో పూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి

వలసలు వెళ్లే ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ కింద పని దినాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచాలని ప్రభుత్వానికి నివేదించామని, అందుకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు రానున్నట్లు చెప్పారు. చెత్త సంపద తయారీలో ఆదోని, కొత్తాళం, మంత్రాలయం మండలాలు పురోగతిని సాధించడంలేదన్నారు. మంత్రాలయం మండల సర్వేయర్ ఎటువంటి సమాచారం లేకుండా పోయినట్లు అధికారులు తెలపడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని సర్వే ఏడీని ఆదేశించారు. రీసర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ పనుల్లో పురోగతి లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి వచ్చే సోమవారానికి అనువైన మైదానాలను గుర్తించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 14 నుంచి కార్తీక మహోత్సవాలు

- డిసెంబర్ 12 వరకు నిర్వహణ
- భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు
- కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణం
- ప్రతి సోమవారం లక్షదీపార్చన
- సమీక్షలో దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు



సమీక్షలో మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థాన ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం: కార్తీక మాసోత్సవాలను నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12 వరకు నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. దేవస్థానంలోని అన్ని విభాగాధిపతులు, ఆలయ ముఖ్య అర్చకులుతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశి, రెండో శని, ఆదివారాల్లో రద్దీ ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. పాతాళగంగ శౌచాలయాలకు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. గంగా భవాని స్నానఘట్టాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేకువ జామున 3 గంటలకే ఆలయ ద్వారాలు తెరిచి 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగేలా చూడాలన్నారు. ప్రభుత్వ సెలవు దినాలు, కార్తీక సోమవారాలు.. మొత్తం 13 రోజుల పాటు స్పర్శ దర్శనం పూర్తిగా నిలుపుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేయాల్సిందిగా ఈఓ ఆదేశించారు. ఆయా రోజుల్లో స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తామని తెలిపారు. సాధారణ రోజుల్లో ఆర్జిత అభిషేకాల టిక్కెట్లను పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. కార్తీకమాసం సందర్భంగా చండీ, రుద్రహోమాలను అధికసంఖ్యలో భక్తులు నిర్వహించుకునే అవకాశం ఉన్నందున వారికి రెండు విడతల్లో హోమాది క్రతువులు నిర్వహించడానికి నిర్ణయించారు. రద్దీ రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో జరిగే కుంకుమార్చన సేవను అమ్మవారి ఆశీర్వచన మండపంలో జరిపిస్తామని ఈఓ తెలిపారు.

కొరత లేకుండా లడ్డూ ప్రసాదాలు

కార్తీకమాసంలో వచ్చే రద్దీని దృష్టిలో ఉంచుకుని కొరత లేకుండా లడ్డూప్రసాదాలు సిద్ధం చేయాలని అధికారులను ఈఓ ఆదేశించారు. రద్దీకి అనుగుణంగా ప్రసాద విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేయాలని ఆదేశించారు. క్యూ కాంప్లెక్స్‌లో దర్శనానికి వేచి ఉండే భక్తులకు మంచి నీరు, బిస్కెట్ ప్యాకెట్లు అల్పాహారంగా అందజేయాలన్నారు. రద్దీకి అనుగుణంగా కేశఖండనశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సమాచారం తెలియజేసేందుకు వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. లోక కల్యాణం కోసం కార్తీకమాసమంతా శివచతుస్సప్తాహ భజనలు, పుష్కరిణి హారతి, లక్షదీపోత్సవం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించాలన్నారు.

26న పుణ్యనదీహారతి

నవంబర్ 27వ తేదీ పౌర్ణమి ఘడియలు మధ్యాహ్నం వరకు మాత్రమే ఉండడంలో ముందురోజు 26వ తేదీన సాయంత్రమే కృష్ణవేణి నదీ మతల్లికి పుణ్యనదీహారతి, పాతాళగంగ వద్ద ఉన్న కృష్ణవేణి విగ్రహానికి పూజలు, సారె సమర్పణ జరపాలని నిర్ణయించారు. అలాగే గంగాధర మండపం వద్ద జల్వాలాతోరణం కూడా ఆ రోజు సాయంత్రమే నిర్వహిస్తామని ఈఓ తెలిపారు

సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలయ నిత్యకళామండపం వద్ద ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని ఈఓ సూచించారు. లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతుల్లో ధార్మిక కార్యక్రమాలను పుష్కరిణి వద్ద కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరిపాలనా భవనంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు కూడా ప్రత్యేక విధులు కేటాయించామన్నారు.

క్లుప్తంగా

టీ తాగేందుకు వెళ్లి మృత్యువాత


మృతి చెందిన మహానంది

ఆస్పరి: టీ తాగేందుకు వెళ్లి ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చిరుమాన్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహానంది (49) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం టీ తాగడానికి గ్రామంలోనికి హోటల్‌కు వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి దగ్గర ఉన్న వ్యక్తి క్షణాల్లో మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాధిత కుటుంబానికి ట్రాన్స్‌కో అధికారులు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డోలమైట్ పౌడర్ లారీ సీజ్


అధికారులు సీజ్ చేసిన లారీ

కర్నూలు (న్యూసిటీ): అనుమతులు లేకుండా అక్రమంగా డోలమైట్ పౌడర్‌ను రవాణా చేస్తున్న లారీని ప్యాపిలి దగ్గర మైనింగ్ అధికారులు సీజ్ చేశారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి భద్రత నిమిత్తం ప్యాపిలి పోలీసుస్టేషన్‌లో ఉంచారన్నారు. లారీలో ఎంతమేర డోలమైట్ పౌడర్‌ను తీసుకెళ్తున్నారని విచారణ చేపట్టి కేసు నమోదు చేసి, అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాండ్రపాడు వద్ద అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు, ఆటోను పోలీసులు పట్టుకున్నారని జిల్లా మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. మూడు ట్రాక్టర్లకు ఒక్కొక్క దానికి రూ.10 వేలు, ఆటోకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించామని చెప్పారు.

యముడి చెక్‌పోస్టులు ఎత్తివేత!

- రహదారి ప్రమాదాల నివారణకు మంత్రి బుగ్గన చొరవ
- జాతీయరహదారిపై రెండు అండర్‌పాస్ బ్రిడ్జీల నిర్మాణం
- మూడు కి.మీ మేర సర్వీసు రహదారి ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు, వాహనదారులు


కంబాలపాడు సర్కిల్‌లో నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జి


కొత్తపల్లె సర్కిల్‌లో నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జి

డోన్: అది హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి. నిత్యం వాహనాలు వేగంగా రయ్..రయ్ మంటూ దూసుకెళ్తుంటాయి. ఈ రహదారిపై డోన్ పట్టణ పరిధిలో రెండు సర్కిల్ ఉండగా గతంలో ఇక్కడ నిత్యం చావు కేకలే. మృత్యువు మాటు వేసిందా.. అనేటట్లుగా ప్రమాదాలు చోటు చేసుకునేవి. ప్రతి నెలలో 40కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగి దాదాపు 10 మందికిపైగా మృత్యువాత పడేవారు. ఎంతో మంది క్షతగాత్రులై ఆసుపత్రికి చేరేవారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కొన్నేళ్లుగా మృత్యువు కుహరాలుగా భయపెట్టిన సర్కిళ్లపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో అండర్‌పాస్ బ్రిడ్జిలు వచ్చేశాయి. ఆరు నెలలుగా ఒక్క ప్రమాదమూ లేదు. డోన్ శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి కంబాలపాడు చౌరస్తా, కొత్తపల్లి చౌరస్తా దాటుతూ ఎంతో మంది వాహనదారులు మృత్యువాత పడ్డారు. జిల్లాలోనే అతి పెద్ద బ్లాక్ స్పాట్‌గా గుర్తించి చర్యలు చేపట్టినా ప్రమాదాలను అధికారులు నివారించలేకపోయారు. డోన్ నుంచి క్రిష్ణగిరి, కోడుమూరు, దేవనకొండ మండలాల పరిధిలోని దాదాపు 40 పల్లెల ప్రజలు జాతీయ రహదారిపై కంబాలపాడు సర్కిల్ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. అలాగే కొత్తపల్లి సర్కిల్ మీదుగా ప్యాపిలి, బేతంచెర్ల మండలాల పరిధిలోని 35 గ్రామాల ప్రజల ప్రయాణించేవారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఏటా దాదాపు 60 నుంచి 80 మంది మృత్యువాత పడేవారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా రోడ్డు ప్రమాదాల్లో పెద్దదిక్కును కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడేవి. దాదాపు ఏడేళ్ల క్రితం కంబాలపాడు సర్కిల్‌లో ట్రాక్టర్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకే సారి 16 మందిని మృత్యువు పొట్టన పెట్టుకుంది. ఇలాంటి ఘోర రోడ్డు ప్రమాదాలు ఏటా ఒకటో, రెండో చోటు చేసుకునేవి.

రూ.70 కోట్లతో అండర్‌పాస్ వంతెనలు

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, డోన్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపారు. కంబాలపాడు, కొత్తపల్లె సర్కిళ్లపై అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ నుంచి రూ.70 కోట్లను మంజూరు చేయించారు. వెంటనే పనులు పూర్తి చేయించి ఆరు నెలల క్రితం ప్రారంభించారు. దీంతో ప్రమాదాలకు చెక్ పడింది. దాదాపు ఐదు మండలాల వాహనదారులు, ప్రయాణికులు క్షేమంగా జాతీయ రహదారిని దాటి ఇంటికి చేరుతున్నారు.


మృత్యు ముఖద్వారంగా ఆనాటి కంబాలపాడు రోడ్డు చౌరస్తా

మూడు కిలోమీటర్ల సర్వీస్ రోడ్డు

పట్టణ శివారులో ప్రమాదకరంగా మారిన ఎన్‌హెచ్ 44 రోడ్డు వెంబడి మూడు కిలో మీటర్ల మేర సర్వీసు రోడ్డు కూడా పూర్తి కావడంతో ప్రయాణికులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. రెండు సర్కిళ్లపై అండర్ పాస్ బిడ్జిల నిర్మాణంలోనే మంత్రి బుగ్గన సర్వీసు రోడ్లపై కూడా దృష్టి సారించారు. ఉడుములపాడు గ్రామం నుంచి యు.కొత్తపల్లె వరకు నేషనల్ హైవే వెంబడి సర్వీసు రోడ్లు నిర్మించడంతో ప్రమాదాలకు చెక్ పడింది.


ఎన్‌హెచ్ 44 పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డు

మంత్రి బుగ్గన చొరవ అభినందనీయం



కొన్నేళ్లుగా జాతీయ రహదారిపై సర్కిళ్లలో ప్రాణ నష్టం జరుగుతున్నా గత పాలకులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రహదారి దాటాలంటే హడలిపోయేవాళ్లం. ఆ సర్కిళ్ల వద్దకు చేరుకునేసరికి ప్రమాద సంఘటనలే గుర్తుకొచ్చేవి. ఈ పరిస్థితుల్లో మంత్రి బుగ్గన చొరవ తీసుకుని అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించడం అభినందనీయం. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించారు. – మేకల రాజు, డోన్

ఎన్నో ప్రాణాలను కాపాడినట్లే



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గుత్తి రోడ్డుపై ఉన్న చౌరస్తాల్లో రెండు వంతెనలు నిర్మించి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారయ్యారు. కలలో కూడా అనుకోలేదు అండర్ బ్రిడ్జిలు కడతారని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలం రుణపడి ఉంటాం. ఈ వంతెనలు గత ప్రభుత్వాలు కట్టి ఉంటే ఎంతో మంది ప్రాణాలు మిగిలేవి. – పద్మావతి, గృహిణి, వెంకటాపురం

భార్య బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరణ!

- ఏపీఎస్పీ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

బొమ్మలసత్రం: భార్య బతికి ఉండగానే చనిపోయినట్లు ధ్రువపత్రం సమర్పించిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ శివశంకరయ్యపై ఆదివారం నంద్యాల తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ దస్తగిరి బాబు తెలిపిన వివరాల మేరకు... ప్రకాశం జిల్లా హజరత్ గూడెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ శివశంకరయ్యకు మహబూబ్‌నగర్‌కు చెందిన మాధవితో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరులు కుమారులు ఉన్నారు. మాధవి పేరుతో రైతునగరం ప్రాంతంలో నాలుగు సెంట్ల స్థలాన్ని శివశంకరయ్య కొనుగోలు చేశాడు. విభేదాల కారణంగా మూడేళ్ల నుంచి శివశంకరయ్యకు మాధవి దూరంగా ఉంటోంది. ఇద్దరు కుమారులను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రైతునగరంలో ఉన్న నాలుగు సెంట్ల స్థలాన్ని కానిస్టేబుల్ శివశంకరయ్య కాజేయాలని గిద్దలూరు ఆసుపత్రిలో మాధవి మృతిచెందినట్లు సర్టిఫికెట్ తీసుకున్నాడు. దీని ఆధారంగా భార్య పేరుపై ఉన్న ఆస్తిని తన సోదరి ఆదిలక్ష్మి పేరిట నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టరు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మాధవి తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ శివశంకరయ్య, ఆదిలక్ష్మిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

కర్నూలు(అర్బన్): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి కొందరు మోసం చేశారని బాధితులు ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించి, చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు అందాయి. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐలు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

- విజయనగరం జిల్లా గరివిడి మండలం కన్నలైన్సీకి చెందిన సువ్వారి గీతావాణి, సువ్వారి కామేశ్వరరావు తనకు వీఆర్‌ఓ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.7 లక్షలు తీసుకొని మోసం చేశారని ఆదోని కార్వాన్‌పేటకు చెందిన లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు.
- విశాఖపట్నానికి చెందిన అంకం నరేష్‌కుమార్ అమరావతిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.50 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలుకు చెందిన హరిబాబు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.
- కెనాల్ మరమ్మతులకు సంబంధించి తన పొలంలో ఇసుక, కంకర, కాంక్రీట్ ప్లేట్లు వేసుకుంటానని, ఇందుకు ఏడాదికి లీజు కింద రూ.35 వేలు ఇస్తానని ప్రొద్దుటూరుకు చెందిన పుట్టా రమణయ్య మోసం చేశారని చెరుకులపాడు గ్రామానికి చెందిన రామాంజనేయుడు ఫిర్యాదు చేశారు.
- ఎమ్మిగనూరుకు చెందిన ఇబ్రహీం 70 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా చెల్లని చెక్కు ఇచ్చారని, న్యాయం చేయాలని ఎమ్మిగనూరుకు చెందిన సంధ్య కోరారు.
- తనకు తెలియకుండా తన పాన్‌కార్డు నంబర్‌తో హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తి లోన్‌యాప్‌లో రూ.34 వేలు రుణం తీసుకున్నారని, లోన్ ఇచ్చిన వారు తనకు ఫోన్లు చేసి నోటీసులు ఇచ్చారని, సమస్యను పరిష్కరించాలని కర్నూలు గణేష్‌నగర్‌కు చెందిన కృష్ణ విన్నవించారు.
- రహంతుల్లా, కృష్ణమోహన్, నాగరాజు అనే ముగ్గురు వ్యక్తులు తనను పరిచయం చేసుకొని ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశచూపి రూ.2.40 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌కు చెందిన మనోహర్ ఫిర్యాదు చేశారు.


స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నేడు సీ.క్యాంపు రైతుబజారుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతు బజారుకు ఈ నెల 31న(మంగళవారం) సెలవు ప్రకటించినట్లు ఎస్టేటు ఆఫీసర్ హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రైతుబజారుకు నెలలో ఒకరోజు సెలవు ప్రకటించి సమగ్రంగా పరిశుభ్రత కార్యాక్రమాలు చేపడుతున్నామన్నారు. రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు.

రూ.కోటి రుణాలకు 8 దరఖాస్తులు

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకల యూనిట్‌లు నెలకొల్పేందుకు వివిధ మండలాల నుంచి రూ.కోటి రుణం కోసం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌కు 8 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలతో పాటు కోళ్లు, పందుల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇందులో బాగంగా ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు. ఇప్పటి వరకు రూ. కోటి విలువ యూనిట్లకు దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకునేందుకు మాత్రమే ఆప్షన్ ఉంది. జిల్లా నుంచి వెళ్లిన దరఖాస్తుల్లో మొదటి విడతలో చిప్పగిరి మండలం నుంచి 3, కౌతాళం, పత్తికొండ మండలాల నుంచి ఒక్కో దరఖాస్తు వెరిఫికేషన్ కోసం వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పంపారు. మళ్లీ వెల్దుర్తి, ఆదోని, పెద్దకడుబూరు మండలాల నుంచి ఒక్కో దరఖాస్తు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ నుంచి వెరిఫికేషన్ కు రాగా.. వీటికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన ముగిసింది. ఒకటి, రెండు రోజుల్లో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌కు పంపనున్నారు.

ఏఎస్‌ఐ గంగన్న మృతి


ఏఎస్‌ఐ గంగన్న (ఫైల్)

సంజామల: స్థానిక పోలీస్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న గంగన్న (55) తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడని ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు..గంగన్న అనంతపురం జిల్లా తాడపత్రిలో నివాసం ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా ఆదివారం తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ రామంజులు, ఎస్‌ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో రూ.55 వేలు నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాలటౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేయుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, వెల్డర్, పెయింటర్ విభాగాల్లో, ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటిషిప్ కోసం నవంబర్ 1 నుంచి 15వ తేదీ లోపు www.apsrtc.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ నమోదు పత్రంతో పాటు పదవ తరగతి మార్క్స్ లిస్ట్, ఐటీఐ మార్క్స్ మెమో, ఎన్‌సీవీటీ, కులధృవీకరణ ప్రతం, ఆధార్ కార్డుల నకలు కాపీలను ప్రిన్సిపాల్, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్, ఏపీఎస్‌ఆర్టీసీ, బళ్లారి చౌరస్తా, కర్నూలు వారి కార్యాలయానికి పంపలన్నారు. మరిన్ని వివరాలు www.apsrtc. ap.gov.in సైట్‌లో పొందుపరిచామన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు(రాజ్‌విహార్): బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకుల సహాయార్థం రెండు నెలల కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తాస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్, ఆపై విద్యార్హతలు కలిగి, 18–26 ఏళ్ల మధ్య వయస్సున్న అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. వివరాలకు 8332918999 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈవీఎంల ప్రథమ స్థాయి పరిశీలన తనిఖీ


ఈవీఎంలను తనిఖీ చేసి రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్నికల పరిశీలకులు లలిత్ మిట్టల్

నంద్యాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనను కేంద్ర ఎన్నికల పరిశీలకులు లలిత్ మిట్టల్ ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంల భద్రత గోడౌన్‌లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ)ను కేంద్ర ఎన్నికల పరిశీలకులు లలిత్ మిట్టల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్లకు సంబంధించి ఎఫ్ఎల్‌సీ కార్యక్రమం బెల్ ఇంజినీర్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా సిబ్బంది హాజరు పట్టికను అలాగే సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరుపట్టికను కూడా పరిశీలించారు. అలాగే మార్కెట్ యార్డ్ గోడౌన్‌లోని పరిసరాలు, భద్రతపై పోలీసుల నుండి ఆరా తీశారు. ఈవీఎంల ప్రథమ స్థాయి పరిశీలన ప్రక్రియ నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేస్తామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, నోడల్ అధికారి సుబ్బారెడ్డి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఇప్పటి వరకు 2,690 కంట్రోల్ యూనిట్లు, 3,055 బ్యాలెట్ యూనిట్లు, 3060 వీవీ ప్యాట్ల ప్రథమ స్థాయి పరిశీలన పూర్తయిందని మిగిలిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన ప్రక్రియను వచ్చేనెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని కేంద్ర ఎన్నికల పరిశీలకులకు వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఎన్నికల పరిశీలకుల వెంట జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కంటైనర్

- ఒకరు మృతి


నాగరాజు(ఫైల్)

ఎమ్మిగనూరు: స్కూటర్‌ను కంటైనర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ దుర్ఘటన ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గోనెగండ్ల మండలం ఐరన్‌బండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు(50) అనే రైతు సోమవారం సాయంత్రం ఎమ్మిగనూరులో ఉల్లి విత్తనాలు కొనుగోలు చేసి స్వగ్రామానికి బయలు దేరాడు. రాళ్లదొడ్డి గ్రామం దాటిన తరువాత మలుపు వద్ద నాగరాజు ప్రయాణిస్తున్న ఎక్స్ఎల్ స్కూటర్‌ను కర్నూలు నుంచి వస్తున్న కంటెయినర్ లారీ ఢీ కొట్టింది. నాగరాజు తలపై కంటెయినర్ టైర్ ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు భార్య సరోజ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐదు నాటు బాంబులు స్వాధీనం

- బాంబ్‌స్క్వాడ్ బృందంతో వెలికితీత


లభ్యమైన నాటుబాంబులు


నాటు బాంబులు దాచిన ప్రదేశాన్ని పోలీసులకు వివరిస్తున్న నిందితుడు దబ్బల వెంకటస్వామి

పగిడ్యాల: పాత ముచ్చుమర్రి పంచాయతీకి మజరా గ్రామమైన పడమర వనుములపాడు గ్రామంలో రహస్యంగా దాచిన ఐదు నాటు బాంబులను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు నెలల క్రితం కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ మధు ఇంటి నీళ్ల ట్యాంక్‌లో లభించిన 22 నాటు బాంబుల కేసులో 8వ నిందితుడిగా ఉన్న దబ్బల వెంకటస్వామి ఇటీవలే కోర్టులో లొంగిపోయాడు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ నేతృత్వంలో ఇతనిని పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించగా పడమర వనుములపాడు సమీపంలో పాడుబడిన శివాలయం వద్ద 5 నాటుబాంబులను దాచినట్లు చెప్పడంతో బాంబ్ స్క్వాడ్ బృందం సోమవారం వెలికితీసింది. వెంటనే నిందితున్ని నందికొట్కూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ వచ్చే నెల 2వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారని సీఐ పేర్కొన్నారు.

పాత కక్షలే కారణం

ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఆర్ఎంపీ డాక్టర్ కరీంబాషా, బోయ పెద్ద రంగడుకు బోయ మద్దిలేటి, బోయ మధు మధ్య పాత కక్షలు ఉన్నాయి. కరీంకు చెందిన కారును బోయ మద్దిలేటి తీసుకెళ్లి ఇష్టానుసారంగా నడపడంతో రిపేరీకి వచ్చింది. అయితే ఇందుకు రూ. 1.50 లక్షలు ఇస్తానని మద్దిలేటి ఒప్పుకున్నా కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో కరీంను నాటు బాంబుల కేసులో ఇరికించేందుకు ప్రణాళిక చేశారు. అయితే వారు తీసుకున్న గోతిలో వారే పడి కటకటాల పాలయ్యారని సీఐ వివరించారు. సీఐ వెంట ముచ్చుమర్రి, మిడుతూరు ఎస్‌ఐలు నాగార్జున, జగన్‌మోహన్, బాంబ్‌స్క్వాడ్ బృందం, వీఆర్వోలు మద్దిలేటి, నరసింహ తదితరులు ఉన్నారు.

రైలు ప్రమాద మృతుల్లో కోసిగి యువకుడు


చాకలి తాయప్ప (ఫైల్)

కోసిగి: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన చాకలి తాయప్ప (20) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా ఈ విషయాన్ని అక్కడ పోలీసులు గుర్తించారు. మృతుడి తండ్రి పాలన్నకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న తాయప్ప మూడు నెలల క్రితం విజయనగరంలో ఓ ప్రవేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చి మళ్లీ విజయనగరం వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పాలన్నకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు తాయప్ప మృతిచెందాడని తెలియడంతో ఆ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో మృతుని తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి బయలుదేరి వెళ్లారు.



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్పలేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ఇప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.




పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను విన డానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు... 'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేటెడ్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.


ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!





సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.


పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు



5 రోజుల వయసులో పిల్ల పురుగులు



గ్రాములో 3 వేల పిల్ల పురుగులు



కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం



ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం



15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్ళు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్ల, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్